నాలుగో స్తంభాన్ని కూల్చేస్తారా?

- సాక్షి ఎడిటర్ ఇంటిపై సోదాలు అప్రజాస్వామిక చర్య
- వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్

ఆకివీడు: ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పత్రికలు తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయని అలాంటి పత్రికా స్వేచ్ఛను అణగదొక్కి, స్తంభాన్ని కూల్చివేస్తారా? అని వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు అంబటి రమేష్ ఆవేదన వ్యక్తంచేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై పోలీసులు అక్రమ సోదాలు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక పాత్రికేయులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన రమేష్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు భంగం కల్పించిన విధంగా ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు సారధిగా ఉన్న పాత్రికేయ రంగంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలపై న్యాయస్థానాలు సుమోటోగా కేసులను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. కనీస నియమాలు మరచి పోలీసులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం దారుణమని సీనియర్ జర్నలిస్టు గుడిపాటి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. పత్రికా రంగానికి గొడ్డలిపెట్టుగా పోలీసు వ్యవస్థ వ్యవహరించిన తీరు ఉందన్నారు. సీనియర్ విలేకరి బీఆర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంలాంటిదని, దానిని ప్రభుత్వం కనిపించనివ్వకుండా చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పాత్రికేయులు చింతా ఆదిశేషు, సర్కార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆకివీడులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

భీమవరంలో..

భీమవరం: పత్రికాస్వేచ్ఛను హరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి చొరబడి పోలీసులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం భీమవరంలో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ నివాసంలో ముందుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సోదాలు నిర్వహించడం ప్రభుత్వంపై సాక్షి పత్రికలో వస్తున్న వ్యతిరేక కథనాలకు ప్రతికారమేనన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ కుంభకోణాలను వెలికితీయడాన్ని తట్టుకోలేక దాడులకు పాల్పడుతున్నారని ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుదాడులు కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలేనన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతంగాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కేఆర్‌ఆర్‌కే గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యుడు నూకల సత్యనారాయణ, వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ల విలేకరులు విజయకుమార్, ఆరేటి శ్రీనివాస్, జి నర్సింహమూర్తి, రవి, చిన్నారి, సత్య, చినబాబు, నర్సింహరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వెంకన్న కల్యాణం


వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా గ్రంధి బాలాజీ, గౌతమి సంవర్ధిని దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణం వైభవోపేతంగా చేశారు. అనంతరం ప్రత్యేక హోమం జరిపించారు. స్వామి వారి కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు, గ్రంధి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల సొసైటీకి రెండు ఏసీల బహూకరణ


కాళ్ల సొసైటీలో ఏసీలు బహూకరిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలు అభినందనీయమని భీమవరం బ్రాంచ్ మేనేజర్ డీఎస్ సంజయ్, పర్సన్ ఇన్‌చార్జ్ గూడవల్లి సత్యనారాయణ అన్నారు. కాళ్ల సొసైటీకి గ్రామానికి చెందిన దాతలు 2 ఏసీలను గురువారం బహూకరించారు. గ్రామానికి చెందిన బడేటి రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బడేటి నరసింహమూర్తి సుమారు లక్ష రూపాయలు విలువ చేసే రెండు ఏసీలను పర్సన్ ఇన్‌చార్జ్ జి.సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా దాత నరసింహమూర్తిని బ్యాంక్ అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గనిశెట్టి బాబ్జి, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు


విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న గోపాలశర్మ

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాలశర్మ యోగాసనాలు నేర్పించారు. అలాగే డ్యాన్స్ మాస్టర్ జి.శ్యామ్ డాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు వృథా చేయకుండా ప్రతి రోజూ వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి.సోమరాజు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి


విస్సాకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని విస్సాకోడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీకాంతం స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం విస్సాకోడేరు సీడీపీఓ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ 1930 టోల్ ఫ్రీ నంబర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజ్వల ఎన్జీఓ కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, అనిల్ కుమార్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

పదో తరగతి విజేతలకు అభినందనలు

యలమంచిలి: యూటీఎఫ్ ఉపాధ్యాయులు గురువారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను నేరుగా కలుసుకుని అభినందించారు. ఇటీవల వచ్చిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులు వరుసగా శూల హరి రామచరణ్ (ఏనుగువానిలంక హైస్కూల్), శీర్ల జానుశ్రీ (మట్లపాలెం), ముళ్ళపూడి సిరిదీపిక (దొడ్డిపట్ల), మెడవల శ్రీహన్సిక (మేడపాడు) రాయుడు కీర్తన (ఇలపకుర్రు)లను వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో ప్రశంసా పత్రం, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఏకేవీ రామభద్రం పోలిశెట్టి క్రాంతి కుమార్, ఎస్ఎస్‌వీ అవధాని పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాధాకృష్ణ ఆటోమోటివ్స్ వర్మ గ్రూప్ (రాయల్ ఎన్‌ఫీల్డ్) సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ జి.జయసూర్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దీంతో పాటు భీమవరం రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ వద్ద చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి సంస్థ సామాజిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ మధువర్మ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ

పాలకోడేరు: ప్రకృతి విపత్తుల సమయంలో గ్రామ స్థాయి సిబ్బంది ఎలా స్పందించాలనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వి.రెడ్డియ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని మూడు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేశామని, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

కొల్లేరులోని డీ–ఫారం భూముల పరిశీలన

ఆకివీడు: కొల్లేరు సరస్సు పరీవాహక ప్రాంతంలోని అభయారణ్య పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గురువారం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన 40 మంది ఆ ప్రాంతవాసులు జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు, వీఆర్వోలను ఆదేశించారు. ఇటీవల చినమిల్లిపాడు గ్రామంలోని డీఫారం పట్టా భూములు, ఇతర భూముల్ని పరిశీలించి, విచారణ చేపట్టగా 1999వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పక్షుల అభయారణ్యంగా ప్రకటించడం వల్ల సదరు భూములపై హక్కులను ఏకపక్షంగా రద్దు అయ్యాయని, సదరు భూములపై అప్పటి ప్రభుత్వం 120 జీఓను జారీ చేసి, కొల్లేరు వైల్డ్ లైఫ్ సెన్సరీగా ప్రకటించిందని, దీని ప్రకారం కొల్లేరు సరస్సులోని గయ్యాలీ భూములన్నింటినీ అటవీ శాఖ స్వాధీనం చేసుకుందని నివేదికలో పేర్కొన్నారు. అభయారణ్య పరిధిలోని భూముల్లో ఏ విధమైన సాగు చేపట్టకూడదని అటవీ శాఖ అధికారులు ఆదేశించారని విచారణ నివేదికలో స్పష్టం డీ–ఫారం పట్టాల జారీ విషయం అట వీశాఖ పరిధిలో ఉందని విచారణా నివేదికను కలెక్టర్‌కు ఆర్ఐ ఆధ్వర్యంలో పంపించారు. దీనిపై డివిజనల్ రెవిన్యూ అధికారి ఫైనల్ విచారణకు ఆదేశించగా ఆయా భూముల్ని ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంటన తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు ఉన్నారు.


డీ-ఫారం భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి

ప్రాథమిక దశ నుంచే క్రీడల్లో ఆసక్తి అవసరం

భీమవరం: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడల్లో ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్‌లో రాణిస్తారని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ అన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చెస్, షటిల్ బ్యాడ్మింటన్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులు క్రీడలు, యోగా వంటి అనేక అంశాల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ ఆర్ రవికిరణ్‌వర్మ, చదరంగం కోచ్ ఎస్ఎస్ చంద్రశేఖర్‌లను నిశాంత్ వర్మ సత్కరించి జ్ఞాపికలు అందించారు. అలాగే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

భీమవరం: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపట్టే సమ్మెలో భీమవరం పట్టణంలోని మునిసిపల్ వర్కర్స్‌యూనియన్స్ పాల్గొంటున్నట్లు యూనియన్ నాయకులు గురువారం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 40 లేబర్ కోడ్స్ రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్‌కోడ్స్‌ను అమలుచేయడాన్ని నిరసిస్తూ సమ్మె చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు భీమవరం పట్టణంలోని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐసీటీయూ ఇతర సంఘాల మునిసిపల్ కార్మికులు సమ్మె పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కిల్లరి మల్లేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు బి.వాసుదేవరావు, ఏఐసీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మహంకాళి తదితరులు పాల్గొన్నారు.


భీమవరం మునిసిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వ్యవసాయ రుణాలపై అవగాహన

కాళ్ల: మండలంలోని కోపల్లెలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్, భీమవరం ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ శిబిరంలో రైతులకు వివిధ రకాల వ్యవసాయ రుణాలు, అర్హతలు, ప్రభుత్వ మద్దతుపై వివరించారు. పలువురు రైతులు తమ రుణ అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు అధికారులు వారి సందేహాలను నివృత్తి చేసి, రుణాల మంజూరుకు సూచనలు ఇచ్చారు. అనంతరం రుణం మంజూరైన రైతులకు రుణ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ వెంకన్న బాబు, జిల్లా లీడ్ బ్యాంకు అధికారి నాగేంద్ర ప్రసాద్, చీఫ్ మేనేజర్లు శ్రీధర్, లావణ్య, వెటర్నరీ ఏడీ మల్లేశ్వరరావు, ఎఫ్‌డీఓ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.


కోపల్లెలో రైతులకు రుణ మంజూరుపత్రాలు అందిస్తున్న దృశ్యం

రోడ్లపైనే ఆవులు, దూడలు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో రోడ్లపై పశువుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో పారిశుద్ధ్య ఇబ్బందులతో పాటుగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. కొన్ని నెలల క్రితం పట్టణంలో ఎక్కడా రోడ్లపై పశువులు, పందులు కనిపించకూడదని మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. పందులను పట్టుకోవడంతోపాటు రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరికలు కూడా చేశారు. తర్వా ఈ విషయాన్ని మరిచిపోయారు. దీంతో బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమనే విమర్శలు వస్తున్నాయి.


తహసీల్దార్ కార్యాలయం రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

కాళ్ల: కలియుగ దైవం కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గ్రామంలో స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యుల ద్వారా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు ,ఆలయ అర్చకులు సమక్షంలో కల్యాణోత్సవం చేశారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సీహెచ్ నాగరాణి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కాళ్ల: ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక జేపీ రోడ్డులో శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, దేవస్థానం చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ రాత్రి 7.30 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే స్వామి వారికి కాకులపాటి వీర రాఘవరావు దంపతులు రెండున్నర కిలోల వెండితో తయారు చేయించిన వెండి కిరీటాన్ని దేవస్థానానికి అందించారు. కిరీటాన్ని స్వామి వారి కల్యాణం రోజున అలంకరిస్తామని పేర్కొన్నారు.


భీమవరం (ప్రకాశం చౌక్): చందన అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారు, అమ్మవారు

వైభవంగా సీతారామ విగ్రహ పునఃప్రతిష్ఠ

ఉండి: స్థానిక సీతారామపేటలో ఉన్న కోదండరామాలయంలో సీతా రాముల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పోనసానపల్లి వీరయ్య, మహలక్ష్మీ దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం జరిపించారు.ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు, సీపీఐ జిల్లా నాయకుడు కలివెట్టి వెంకట్రావు, సీతామపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగిపై దాడి

ఉండి: పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో పంచాయతీ ట్యాంక్ వాచర్, బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమంతు కృష్ణారావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఆరివెల్లి నరసన్న అనే వ్యక్తి ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిపన్ను విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడేందుకు వెళ్లిన నరసన్న అక్కడే విధుల్లో ఉన్న ఉద్యోగిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐకేపీ సెంటర్లను పరిశీలించిన తహసీల్దార్


సిద్ధాపురంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు

సాక్షి స్పందన

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం, కాళింగగూడెం ఐకేపీ సెంటర్లను గురువారం తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆర్ఎస్‌కేల వద్ద ఉన్న ధాన్యం లోడు ట్రాక్టర్లకు మోక్షం కలిగింది. వెంటనే రైతులు సూచించిన రైస్ మిల్లులకు ధాన్యం ట్రక్కు షీటును ఇవ్వడంతో ధాన్యం ఆయా మిల్లుల వద్ద దిగుమతి అయ్యింది. టార్గెట్ పేరుతో ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సాక్షి ప్రచురించిన కథనం నేపథ్యంలో అధికారులు స్పందించారు. మండలంలోని చెరుకుమిల్లి, సిద్ధాపురం, కాళింగగూడెం, చినమిల్లిపాడు తదితర గ్రామాల్లో దాళ్వా ధాన్యం అధిక మొత్తంలో రాసుల్లోనూ, నెట్లపై ఉంది. ఆయా రైతుల సమస్యలపై ఏ మేరకు స్పందిస్తారనేది వేచి చూడాలి.

పశుగ్రాసానికి గడ్డు కాలం

పెనుగొండ: అకాల వర్షాలకు పొలాల్లోని ఎండుగడ్డి పశుగ్రాసానికి పనికి రాకుండా పోయిందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి కోతలు జరుగుతుండగా అకాల వర్షంతో వరి గడ్డి మొత్తం వర్షార్పణం అయింది. దీంతో రానున్న రోజుల్లో పశుగ్రాస కొరత తప్పదంటూ పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే ఇటీవల పెరిగిన యంత్రాలతో వరికోతలు జరుగుతండడంతో గడ్డి కొరత ప్రతి ఏటా ఎదురవుతుంది. దీంతో గడ్డి ధరలు ఆకాశాన్ని అంటాయి. కొద్దిపాటిగా లభించే గడ్డితో పాడిరైతులు కాలం గడుపుకుంటూ వస్తున్నారు. అయితే కోతలు ముమ్మరంగా ఉన్న తరుణంలో శనివారం, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలతో కోతలు పూర్తయిన ప్రాంతాల్లో వరి గడ్డి చేలల్లోని ఉండిపోయింది. దీంతో గడ్డి సేకరించే అవకాశం లేకుండాపోయింది.

అదనపు ఖర్చుతో కుదేలు

వర్షాలు రాక ముందు కోతలు పూర్తయిన అనంతరం గడ్డి చుట్టే యంత్రాలతో గడ్డి చుట్టలు చుటించే వారు. ఒక్కో గడ్డి చుట్టకు చుట్టడానికి యంత్ర నిర్వాహకులు రూ.30 వరకూ ధర తీసుకునే వారు. దీంతో ఎకరం గడ్డి వరిచేలో రూ.3 వేల వరకూ ఖర్చయ్యేది. మరో రెండు మూడు వేలు రూపాయలతో పశువుల మకాంకు చేర్చుకునేవారు. గతంలో ఇదే గడ్డి రూ. 3 వేలతో ఎకరం గడ్డి లభించేది. వరి కోత యంత్రాలు వచ్చిన తరువాత గడ్డి లభ్యత తగ్గిపోవడంతో రూ.6 వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ పరిస్థితి సైతం లేకుండా పోయింది. వర్షంతో గడ్డి కొరత విపరీతంగా ఏర్పడింది. ఎక్కడ గడ్డి అక్కడే ఉండిపోయి, చీకిపోవడం ప్రారంభమైంది. కొందరు పాడి రైతులు మాత్రం వ్యయ ప్రయాసలతో గడ్డిని తెచ్చుకుని మేట్లు వేసుకుని పశుగ్రాస కొరత నుంచి బయట పడడానికి ప్రయత్నిస్తున్నారు. గడ్డి చుట్ల మేట్లు వేసి బరకాలు కప్పి గడ్డిని రక్షించుకుందామనుకున్న వారిని ఈదురుగాలులు నిరాశపరచాయి. ఈదురు గాలులలకు ఎండుగడ్డి పాడై పోయింది. దీంతో పశుగ్రాస కొరతను ఎదుర్కోడానికి పాడి రైతులు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవడం ప్రారంభించారు.

టీఎంఆర్ పశుగ్రాసం పంపిణీ చేయాలి

పాడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం టీఎంఆర్ పశుగ్రాసాన్ని ఉచితంగా అందించడానికి ఏర్పాట్లు చేయాలని పాడి రైతులు కోరుకొంటున్నారు. గతంలో టీఎంఆర్ పశుగ్రాసం సబ్సీడీపై పంపిణీ చేసినా, ఇటీవల కాలంలో నిలిచిపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాడిరైతులకు అండగా పలువురు కోరుతున్నారు.


వరి చేలల్లోనే పనికి రాకుండా పోయిన వరి గడ్డి


గడ్డిని కాపాడుకోవడానికి బరకాలు కప్పిన దృశ్యం